PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

సోమవారం 19-10-2026 | పేజీలు : 8 | వెల రు : 2/- | సంపుటి : 2 సంచిక :139 | ప్రచురణ: సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

## ప్రశ్నించే నోళ్లను మూయించేందుకే పోలీసు దౌర్జన్యం: రాహుల్‌గాంధీ

"ఇదంతా ప్రజా గళాన్ని మూయించే కుట్రలో భాగం. ఎవరూ ప్రశ్నించే సాహసం చేయకుండా నిరోధించాలనే కుట్రలో భాగంగా నిరసనకారుల్లో భయాన్ని నింపుతూ వారిని తీవ్రంగా అవమానించడమే ఈ దమననీతి ఆంతర్యం" అని ఆయన అన్నారు.



మిగతాది 2లో

## భారత్ విషయంలో ఆ రోజు హద్దులు దాటి మాట్లాడాను: జేడీ వాన్స్



మిగతాది 2లో

కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, టాటా, విప్రో, హెచ్‌సీఎల్, క్యాప్‌జెమిని కంపెనీలను పర్మ్ (పర్మినెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్) నుంచి సస్పెండ్ చేసిన సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనిపై తాజాగా ఓ సమావేశంలో మాట్లాడుతూ.. పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. 'భారత్ విషయంలో ఆ రోజు నేను హద్దులు దాటి మాట్లాడాను..

## విజయదశమినాడు ఏం చేయాలి?

శమీ పూజ, ఆయుధ పూజ, కొత్త పనులు... అన్నీ శుభమే!






నవరాత్రుల పూజలు సరే... మరి, నవమి, దశమి తిథుల్లో పాటించాల్సిన నియమాలూ, కొత్త పనిని ప్రారంభించే ముందు ముహూర్తాన్ని చూసుకోవడమూ... వంటి సందేహాలూ మామూలేగా. వాటినీ నివృత్తి చేసుకుందాం రండి.

### శమీ పూజకు అంత ప్రాధాన్యం ఎందుకు?

పాండవులు అజ్ఞాతవాసానికి వెళ్లేముందు తమ ఆయుధాలను జమ్మిచెట్టుపైన దాచిపెట్టి... తల్యత విజయదశమి నాడు వాటిని తిరిగి తీసుకుని, శమీ వృక్షానికి పూజలు చేశారు. అలాగే, లంకపైప దండెత్తే ముందు శ్రీరాముడు కూడా శమీ వృక్షాన్ని పూజంచాడట. ఈ ఇతివృత్తాల ఆధారంగానే శమీ వృక్షాన్ని పూజించే సంప్రదాయం వచ్చింది.. దీని పల్లె చేపట్టే ప్రతి పనిలోనూ విజయం లభిస్తుందని అంటారు. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం... శమీ వృక్షం శని దేవుడికి ప్రియమైంది. ఏడాదికి ఒకసారైనా దర్శించుకుని పూజిస్తే శనిదోషాలు తొలగిపోవడంతోపాటు ఏలినాటి శని ప్రభావమూ ఉండదు.

దశమి సాయంత్రం శమీ చెట్టు దగ్గరకు వెళ్లి పూజలు చేసి, ఆకుల్ని బంగారంగా భావించి ఒకరికొకరు కానుకగా ఇచ్చిపుచ్చుకుంటారు. ఈ సంప్రదాయం బిహార్, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఎక్కువగా కనిసిస్తుంది.

### ఆయుధ లేదా వాహన పూజ వెనకున్న పరమార్థం ఏమిటీ?

దేవీ భాగవతం ప్రకారం, మహానవమి నాడు దుర్గాదేవి మహిషాసురుడిని సంహరించి, ఆయుధాలను పక్కన పెట్టి విశ్రాంతి తీసుకుందట. దేవతలంతా ఆమె చేతబట్టిన ఆయుధాలకు పూజలు చేశారు. అలాగే పాండవులు అజ్ఞాతవాసానికి వెళ్తున్నప్పుడు తమ ఆయుధాలను శమీ వృక్షంపై భద్రపరిచారు. దసరాకు ముందు వాటిని తీసి పూజించి యుద్ధానికి వెళ్లారు. అందుకే మనం సంపాదించుకునేందుకూ, జీవించేందుకూ ఉపయోగించే వస్తువులను దైవంగా భావించి మహానవమి నాడు పూజించాలి. సూటిగా చెప్పాలంటే మనకు మేలు చేసే ప్రతి వస్తువులోనూ దైవత్వాన్ని చూడటమే దీని ఉద్దేశం.

మన ఆయుధాలు, వాహనాలు, వృత్తి పరికరాలు అన్నీ దైవస్వరూపాలే.




### కొత్త పని.. కొత్త వ్యాపారం ప్రారంభిస్తే మంచిదేనా?

విజయదశమి ఒక స్వయంసిద్ధ ముహూర్తం. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకూ ప్రతి క్షణమూ శుభప్రదమే. చెడుపైన మంచి గెలిచిన రోజు కాబట్టి. ఏ కొత్త పని చేపట్టినా దైవబలంతోడవుతుందని అంటారు.

### ఆచరించాల్సిన నియమాలు

- జగన్మాతను విజయదుర్గారూపంలో కొలవాలి.
- అపరాజితా దేవిని పూజిస్తే తలపెట్టే ప్రతి కార్యంలో తిరుగు ఉండదు.
- మధ్యాహ్నం 1.40 – 3.02 మధ్య విజయ ముహూర్తం.
- అమ్మవారి గుడికి వెళ్లినా మంచిదే.
- పాలపిట్టను చూసి విజయాన్ని కాంక్షిస్తూ నమస్కరించడం ఓ సంప్రదాయం.

### నవరాత్రుల దీక్షను ఎప్పుడు విరమించాలి?

నవమి ఉదయం పూజలతో లేదా దశమి వరకూ దీక్ష. అఖండ దీపం ఉంటే నవమి ముగింపు వరకు లేదా దశమి ఉదయం వరకు. కన్యాపూజ చేసి వ్రతం ముగిస్తారు.

## శాంతికి హామీ... దీప్కేకు బెయిల్

- వైఫై లేదు.. ఫోన్ లేదు
- రాత్రంతా జైల్లోనే..
- దీప్కేకు అరావలి ఆహ్వానం

పోలీసుల అదుపులో ఉన్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే శనివారం విడుదలయ్యారు. శుక్రవారం ఆందోళనల సందర్భంగా పోలీసులు అరెస్టు చేయగా శనివారం బెయిలు లభించింది.



మిగతాది 2లో

## ఆర్టీసీ టికెట్ ధరలు పెంచి పండుగ సంబురం లేకుండా చేశారు: హరీశ్‌రావు




2లో

రెగ్యులర్ బస్సులు తగ్గించి, స్పెషల్ బస్సుల పేరుతో ప్రయాణికుల జేబులకు చిల్లులు పెట్టడం దారుణమన్నారు. ఈ మేరకు హరీశ్‌రావు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు టికెట్ ధర రూ.230 ఉంటే ఏకంగా రూ.400కు పెంచారన్నారు.

## మంచినీటికి ఇబ్బందులు రానీయం: మంత్రి సీతక్క



2లో

రిజర్వాయర్లలో నీటి నిల్వలు డెడ్ స్టోరేజ్ స్థాయికి చేరినా సరఫరాకు ఆటంకం కలగకుండా వందకు పైగా అత్యవసర పంపులు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని గ్రామీణ తాగునీటి సరఫరా కార్యాలయంలో శనివారం మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

## ఆయిల్‌పామ్ తోటల్లో విద్యుత్‌లైన్లు మార్చాలి

- దుమ్ముగూడెం వద్ద నీటి నిల్వకు చర్యలు తీసుకోవాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి తుమ్మల వినతి
- పైపుల ద్వారా సీతారామ నీటి తరలింపుతో భూసేకరణ భారం తగ్గుతుందని సూచన



మిగతాది 2లో

ఆయిల్‌పామ్ తోటల్లో విద్యుత్తు లైన్లను కవర్డ్ కండక్టర్లుగా మార్చేందుకు రాష్ట్రస్థాయిలో ఉమ్మడి విధానం రూపొందించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. శనివారం తుమ్మల.. ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో కలిసి.. పలు అంశాలపై వినతిపత్రాలను అందజేశారు. "రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగుచేస్తున్న రైతులతో పాటు కొత్తగా సాగుచేయాలనుకునే వారికి విద్యుత్తు లైన్లు సమస్యగా మారాయి. చెట్లు ఎత్తుగా పెరిగిన తర్వాత కొమ్మలు విద్యుత్తు తీగలను తాకడం వల్ల ప్రమాదాలు తలెత్తుతున్నాయి. ఆయిల్‌పామ్ తోటల పరిధిలో 11 కేవీ బేర్ కండక్టర్ల స్థానంలో కవర్డ్ కండక్టర్లు ఏర్పాటుచేస్తే రైతులకు సౌకర్యంగా ఉంటుంది. సీతారామ ఎత్తిపోతలలో సాధ్యమైన చోట్ల పైపుల ద్వారా నీటిని పంపిణీ చేయడం వల్ల సుమారు 9,767 ఎకరాల భూమి సేకరించాల్సిన అవసరం ఉండదు. తద్వారా అందుకయ్యే వ్యయం సుమారు రూ.2,148 కోట్లు తగ్గుతుంది.

# సంపాదకీయం

## యూత్ పెట్టే పరీక్షలో మోదీ పాసవుతారా?

హార్దిక్ పటేల్ ఎవరికైనా గుర్తున్నాడా? ఒక దశాబ్దం క్రితం వార్తా పత్రికల ఫ్రంట్ పేజీలలోను, టెలివిజన్ ప్రైమ్--టైమ్ ప్రసారాలలోనూ అతడికి చాలా ప్రాధాన్యం లభించింది. 2015లో గుజరాత్‌లో పాటీదార్ సామాజికుల ఆందోళనకు పటేల్ నాయకత్వం వహించినప్పుడు అతడి వయసు 22 సంవత్సరాలే. హార్దిక్ ర్యాలీలు ఆ రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని కుదిపివేశాయి. దానికి గడ్డు పరిస్థితులను సృష్టించాయి. అవి చివరకు 2016లో ముఖ్యమంత్రి ఆనందిబెన్ పటేల్ నిష్క్రమణకు దారితీశాయి. నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీని సవాల్ చేసిన ఆ యువకుడు ఇప్పుడు మరో బీజేపీ ఎమ్మెల్యే! తిరుగుబాటు నుంచి పాలకపక్షం శ్రేణుల్లోకి హార్దిక్ ప్రస్థానం 'గుజరాత్ మోడల్ ఆఫ్ మేనేజింగ్ డిసెంట్' (భిన్నాభిప్రాయాలు, నిరసనలను అణచివేయడంలో గుజరాత్ విధానం)ను విశదం చేస్తుంది. ఒక ఉద్యమాన్ని రాజ్యాధికారంతో అణచివేసేందుకు మీరు ప్రయత్నించవచ్చు లేదా ఆ ఉద్యమ ప్రధాన నాయకులను అధికార రాజకీయ వ్యవస్థలో భాగస్వాములుగా చేసుకోవచ్చు. నిరసనకారుడు ఒక భాగస్వామిగా మారవచ్చు, ఆందోళనకారుడు అస్మదీయుడు కాగలడు. అయితే ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ఇప్పుడు ఎదుర్కోవలసిన ప్రశ్న-- బలవంతపెట్టడం లేదా కలుపుకుపోవడం, లేక ఆ రెండు పద్ధతుల కలగలుపుతో గుజరాత్‌ను పాలించిన రీతిలో విశాల భారత్‌ను పరిపాలించడం సాధ్యమేనా?

ఢిల్లీలో ఇటీవల కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళనకారులపై దమనకాండ ఆ సవాల్‌కు ఒక దృష్టాంతంగా నిలుస్తుంది. భారత ఎన్నికల సంఘం ప్రధానాధికారి (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా తలపెట్టిన నిరసనలను భగ్నం చేసేందుకు ఢిల్లీ పోలీసులు ముందస్తుగా సీజేపీ నిరసనకారులను నిర్బంధంలోకి తీసుకున్నారు. ప్రజలు నిరసన ప్రదేశానికి చేరకుండా అవరోధాలు కల్పించారు. వందలాది యువజనులను అదుపులోకి తీసుకుని తాత్కాలిక డిటెన్షన్ సెంటర్లకు తరలించారు. ఈ పరిణామాలను కవర్ చేస్తున్న జర్నలిస్టులు కూడా పోలీసు ప్రతాపాలకు గురయ్యారు. సాధారణంగా ద్వైధీభావంతో వ్యవహరించే సుప్రీంకోర్టు సైతం నిరసన తెలిపే స్వేచ్ఛ ఒక ప్రాథమిక హక్కు అని మరోసారి నొక్కి చెప్పిందంటే పోలీసులు వ్యవహరించిన తీరు ఎంత అప్రజాస్వామికంగా ఉన్నదో అర్థమవుతుంది.

ప్రతిపక్షాల మరో అరాచక ఆందోళనను తాము ఎదుర్కొంటున్నట్టు మోదీ సర్కార్ విశ్వసించి ఉండవచ్చు. విపక్షాల నిరసనను పోలీసులతో అదుపుచేయవచ్చని, రాజకీయ దురుద్దేశాలతో ఆ నిరసనకు పూనుకున్నాయని కొట్టివేయవచ్చని కూడా పాలకులు భావించి ఉండవచ్చు. నిరసనల నిర్వాహకులను అరెస్ట్ చేయడం ద్వారా వాటి ప్రభావాన్ని నివారించవచ్చని వారు అనుకుని ఉండవచ్చు. అయితే ఆ అంచనా పూర్తిగా ప్రమాదకరమైన తప్పుడు ఆలోచనే. ఢిల్లీ పరిణామాలు ఈ విషయాన్నే ధ్రువపరుస్తున్నాయి. ఇది సీఏఏ (పౌరసత్వ చట్ట సవరణ) వ్యతిరేక ఆందోళన కాదు. ఆ సందర్భంలో నిరసనకారులను జాతి వ్యతిరేకులు అని అధికార వర్గాలు నిత్యం నిందించాయి. వారిలో ఒకరైన ఉమర్ ఖలీద్ 2020 నుంచి జైలులో ఉన్నాడు. ఇది మూడు కొత్త వ్యవసాయ చట్టాలపై ప్రజ్వరిల్లిన రైతుల ఉద్యమం కూడా కాదు. ఉద్యమించిన రైతులను ప్రభుత్వం తొలుత ప్రతిఘటించింది. వారిలో కొందరు ఖలిస్థానీలు అని కూడా ఆరోపించింది. అంతిమంగా నవంబర్ 2021లో ఆ మూడు చట్టాలను ఉపసంహరించుకోవడం మోదీ సర్కార్‌కు అనివార్యమయింది. ఈ ఉదంతాలు అన్నీ ప్రజా ఉద్యమాలను ఎదుర్కోవడంలో ప్రభుత్వ సంసిద్ధతను తెలియజేశాయి. ప్రస్తుత ఉద్యమం విసురుతున్న సవాల్ స్వభావాన్ని ప్రభుత్వం అర్థం చేసుకున్నదా లేదా అన్నది ఈ నాటి ఒక ముఖ్యమైన ప్రశ్న.

ఎందుకంటే ఇది కాంగ్రెస్, రాహుల్‌గాంధీ లేదా కొన్ని ప్రాంతీయ రాజకీయ పక్షాలతో వ్యవహరించడమంత తేలికైన విషయం కాదు, బీజేపీకి ఒక శక్తిమంతమైన ఎన్నికల యంత్రాంగం ఉన్నది. గత పదేళ్లుగా ఆ పార్టీ జాతీయ, రాష్ట్ర స్థాయి ఎన్నికలలో అప్రతిహతంగా గెలుస్తూ వస్తోంది. ఎన్నికలు వచ్చినప్పుడు సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ ఉన్నా, లేకపోయినా తమ ప్రత్యర్థులతో సమర్థంగా పోటీ పడేందుకు అవసరమైన సమస్త వనరులు తమకు ఉన్నాయనే ధీమా బీజేపీ నాయకులకు ఉన్నది.

అయితే ప్రస్తుత సవాల్ ఒక సంప్రదాయ రాజకీయ పక్షం నుంచి వచ్చింది కాదు. రాజకీయ నాయకుల తీరుతెన్నుల పట్ల ఏ మాత్రం సహనం లేని యువ భారతీయులు విసిరిన సవాల్ అది. సంప్రదాయ రాజకీయ ప్రత్యామ్నాయాలను కూడా వారు విశ్వసించరు. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే పాలకులతో ఘర్షణపడినప్పుడు వారు కోల్పోయేది కూడా ఏమీ లేదు. మరి ఇటువంటి యువ భారతీయుల నుంచి సవాల్ ఎదురయినప్పుడు పాలకులు ఎలా ప్రతిస్పందించాలి? వారి ఆగ్రహం పాలకులకు పూర్తిగా ఒక భిన్నమైన రాజకీయ సవాల్‌ను విసిరింది, సందేహం లేదు. ప్రతిస్పందన కూడా భిన్నమైన రీతిలో ఉండితీరాలి. అయితే తాము ఎదుర్కొంటున్న శక్తిని మోదీ ప్రభుత్వం తక్కువగా అంచనా వేసిందని భావించేందుకు ఆస్కారమున్నది.

గత మేలో సీజేపీ తొలుత ప్రజాజీవితంలో ప్రత్యక్షమయినప్పుడు ప్రభుత్వమూ, దాని మద్దతుదారులు దానిని కొట్టివేశారు, తేలికగా తీసుకున్నారు. గౌరవప్రదంగా లేని పేరు, మీమ్స్ ఆధారిత రాజకీయాలు దానిని దూషణ భూషణలకు గురిచేశాయి. సీజేపీతో వచ్చే ముప్పు ఏమీ లేదని భావించినందునే జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శనకు దానిని అనుమతించారు. అయితే నీట్ ప్రశ్నపత్రాల లీక్ విషయంలోను, తమ భవిష్యత్తు విషయంలోనూ యువ భారతీయుల వ్యాకులత, ఆగ్రహావేశాలు అంత తేలిగ్గా సమసిపోయేవి కావు. సీజేపీ ఉద్యమం విద్యార్థులు, యువజనులకే పరిమితం కాకుండా విశాల ప్రజాశ్రేణుల మద్దతును పొందింది. నీట్ ప్రశ్నపత్రాల వివాదంపై ప్రభుత్వ ప్రతిస్పందన రాజకీయ పర్యవసానాలకు దారితీసింది. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనివార్యమయింది.

ప్రస్తుత ఉద్యమం ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా జరుగుతోంది. ప్రతిపక్షాలు ఉద్యమించీ ఉద్యమించీ అలసిపోయి మిన్నకుండి పోతాయని ప్రభుత్వం భావిస్తుందేమో. కానీ నిరసనకారుల పట్ల పోలీసులు వ్యవహరించిన దృశ్యాలు ప్రజల మనః ఫలకాల నుంచి అంత త్వరగా చెరిగిపోతాయా? యువ నిరసనకారులపై హిందూ రక్షాదళ్ అనే హిందుత్వ బృందం దాడుల విషయమేమిటి? అటువంటి సంఘటనలపై విచారణ తప్పనిసరి. వాటికి జవాబుదారీతనం లేకపోతే ఎలా? మౌనం వహించడం సరికాదు. యువజనులపై పోలీసుదాడుల దృశ్యాలు డిజిటల్ విశ్వంలో వెన్వెంటనే వ్యాపించాయి. ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే టీవీ చానెళ్లు సైతం ఆ ఉదంతాలకు సంబంధించిన వార్తల ప్రసారాన్ని ఉపేక్షించలేకపోయాయి.

ఇక్కడ తరాల అంతరం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చేయడం నేర్చుకోవడానికి ప్రయత్నిస్తున్న మంత్రులు, రాజకీయవేత్తలు ఉన్న ప్రపంచం... రాజకీయ సమాచారాన్ని స్వతస్సిద్ధంగా సృష్టించి, పంచుకుంటూ, స్పందిస్తున్న యువజనులు ఉన్న ప్రపంచం ఒకటి కావు. అవి పూర్తిగా భిన్నమైనవి. ఒక మంత్రి పక్కా ప్రణాళికతో అత్యంత జాగ్రత్తగా రూపొందించిన సందేశం ప్రజలలోకి విస్తృతంగా వెళ్లవచ్చు. అయితే వారు దానికి ఎలా స్పందించాలో అది నిర్దేశించలేదు. డిజిటల్ ప్రజారంగం ఒక టెలివిజన్ స్టూడియోకు భిన్నమైనది. టీవీ స్టూడియోలో అయితే ఎవరు, ఎప్పుడు మాట్లాడాలో ప్రభుత్వం నిర్ణయించగలదు. డిజిటల్ విశ్వం విషయంలో అటువంటిది కుదరదు. ఈ కారణంగానే ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవల్సిన అవసరమున్నది. ప్రజాస్వామిక జవాబుదారీతనం అనేది ఉద్యోగాలు, ధరల పెరుగుదల, పరీక్షల నిర్వహణ, తమ భావి అవకాశాలపై వ్యాకులతల నుంచి వేరుగా ఉండే అంశం కాదని యువ భారతీయులు భావిస్తున్నారు. ఈ దృష్ట్యా ప్రస్తుత ఆందోళనల పట్ల మోదీ ప్రభుత్వం భిన్న దృక్పథంతో వ్యవహరించవలసిన అవసరమున్నది. భారత్ అంటే కేవలం గుజరాత్ మాత్రమే కాదు కదా. గుజరాత్ నమూనా పూర్తిగా ఒక అత్యంత కేంద్రీకృత రాజకీయ నాయకత్వం ప్రాతిపదికన రూపొందింది. ప్రభావశీల నాయకుడు దానికి కీలకం. ఆయన నేతృత్వంలోని ప్రాబల్య పార్టీ రాజకీయ కథనాలను ప్రభావితం చేస్తోంది. అయితే భారతదేశ వైశాల్యమూ, వైవిధ్యమూ, ప్రజాస్వామిక సంస్థలు మరింత సర్దుబాటు దృక్పథంతో కూడిన నాయకత్వ శైలిని డిమాండ్ చేస్తున్నాయి.

ఈ వాస్తవాన్ని అంగీకరించాలి. అంగీకరించడమంటే ప్రతి నిరసన బృందమూ చేసే ప్రతి డిమాండ్‌ను విధిగా ఆమోదించాలని కాదు. శాంతి భద్రతలను కాపాడటమనేది ప్రభుత్వాల చట్టబద్ధ బాధ్యత. నిరసనకారులు హింసాకాండకు పాల్పడినట్టు గట్టి సాక్ష్యాధారాలు ఉన్నప్పుడు అందుకు వారిపై చర్య తీసుకోవల్సిందే. అయితే చట్టాన్ని అమలుపరచడం, భిన్నాభిప్రాయాన్ని ముప్పుగా పరిగణించడం మధ్య మౌలిక తేడా ఉన్నది. ఆందోళనకారులతో చర్చించడం వారి షరతులకు లోబడడం ఎంత మాత్రం కాదు. విమర్శకుల వాదనలను వినేందుకు సుముఖత చూపడం వల్ల అధికారం తగ్గదు. అది అధికారాన్ని మరింత విశ్వసనీయం చేస్తుంది.

## ఆయిల్‌పామ్ తోటల్లో విద్యుత్‌లైన్లు మార్చాలి

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: ఆయిల్‌పామ్ తోటల్లో విద్యుత్తు లైన్లను కవర్డ్ కండక్టర్లుగా మార్చేందుకు రాష్ట్రస్థాయిలో ఉమ్మడి విధానం రూపొందించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. శనివారం తుమ్మల.. ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో కలిసి.. పలు అంశాలపై వినతిపత్రాలను అందజేశారు. "రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగుచేస్తున్న రైతులతో పాటు కొత్తగా సాగుచేయాలనుకునే వారికి విద్యుత్తు లైన్లు సమస్యగా మారాయి. చెట్లు ఎత్తుగా పెరిగిన తర్వాత కొమ్మలు విద్యుత్తు తీగలను తాకడం వల్ల ప్రమాదాలు తలెత్తుతున్నాయి. ఆయిల్‌పామ్ తోటల పరిధిలో 11 కేవీ బేర్ కండక్టర్ల స్థానంలో కవర్డ్ కండక్టర్లు ఏర్పాటుచేస్తే రైతులకు సౌకర్యంగా ఉంటుంది. సీతారామ ఎత్తిపోతలలో సాధ్యమైన చోట్ల పైపుల ద్వారా నీటిని పంపిణీ చేయడం వల్ల సుమారు 9,767 ఎకరాల భూమి సేకరించాల్సిన అవసరం ఉండదు. తద్వారా అందుకయ్యే వ్యయం సుమారు రూ.2,148 కోట్లు తగ్గుతుంది. దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద మీటరు నుంచి మీటరున్నర ఎత్తు వరకు ఇసుక బస్తాలను ఏర్పాటుచేస్తే సుమారు టీఎంసీ నీటిని నిల్వ చేయవచ్చు' అని తుమ్మల వినతిపత్రం ద్వారా వివరించారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

## ఆర్టీసీ టికెట్ ధరలు పెంచి పండుగ సంబురం లేకుండా చేశారు: హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ టికెట్ ధరలను పెంచి ప్రజలకు పండుగ సంబురం లేకుండా చేస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. రెగ్యులర్ బస్సులు తగ్గించి, స్పెషల్ బస్సుల పేరుతో ప్రయాణికుల జేబులకు చిల్లులు పెట్టడం దారుణమన్నారు. ఈ మేరకు హరీశ్‌రావు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు టికెట్ ధర రూ.230 ఉంటే ఏకంగా రూ.400కు పెంచారన్నారు. మహబూబ్‌నగర్ నుంచి ఎంజీబీఎస్‌కు రూ.220 ఉంటే.. ఇప్పుడు రూ.290కి పైగా వసూలు చేస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని రూట్లలో టికెట్ ఛార్జీలు డబుల్ చేసి జేబులు గుల్ల చేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచకుండా, రెగ్యులర్ గా నడిచే బస్సులకే పండుగ స్పెషల్ బోర్డులు తగిలించి దోపిడీ చేస్తున్నారన్నారు. ఇప్పటికే మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో ఆర్టీసీ టికెట్ ఛార్జీలను 5 సార్లు పెంచారని.. ఇప్పుడు పండుగల పేరుతో డబుల్ ఛార్జీలు వసూలు చేస్తూ ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు

## మంచినీటికి ఇబ్బందులు రానీయం: మంత్రి సీతక్క

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా గ్రామస్థాయి నుంచి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీ స్థాయికి చేరినా సరఫరాకు ఆటంకం కలగకుండా వందకు పైగా అత్యవసర పంపులు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని గ్రామీణ తాగునీటి సరఫరా కార్యాలయంలో శనివారం మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్, కమిషనర్ దివ్యాదేవరాజన్, ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి, చీఫ్ ఇంజినీర్లు, ఎస్ఈలు, ఈఈలు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. 'అధికారులు భూగర్భజలాలను పెంపొందించేందుకు బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాల పనులను పూర్తి చేయాలి. చెక్‌డ్యాంల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. నవంబరులో జిల్లా కలెక్టర్లు జిల్లా, మండల స్థాయిల్లో తాగునీటి అవసరాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి. సింగూరు రిజర్వాయర్‌పై ఆధారపడిన జిల్లాల్లో తీసుకోవాల్సిన చర్యలపై ఈ నెల 23న ప్రత్యేక సమావేశం నిర్వహిస్తాం' అని తెలిపారు.

## ప్రజలకు స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశం కల్పించాలి: జగన్

మొదటిపేజీ తరువాయి



విజయవాడ: ప్రజలకు స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశం కల్పించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ పునేఠాను కోరినట్లు వైకాపా అధినేత జగన్ తెలిపారు. విజయవాడలో ఎస్ఈసీని కలిసి రాష్ట్రంలో జరుగుతున్న పలు ఘటనలపై ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో జగన్ మాట్లాడారు.

"రెండు, మూడు రోజులుగా జరుగుతున్న ఘటనలపై ఆధారాలతో సహా ఎస్ఈసీకి వివరించాం. పలు చోట్ల వైకాపా అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను లాక్కుంటున్నారు. సాయంత్రం గవర్నర్‌ను కూడా కలిసి అన్ని వివరాలు తెలియజేస్తాం. కేంద్ర బలగాలను రప్పించాలని ఎస్ఈసీకి విజ్ఞప్తి చేశాం. పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల లోపల, బయట లైవ్ ప్రసారాలు ఉండాలని కోరాం. 17 సి ఫామ్‌లో సంతకాలు ఫోర్జరీ జరగకుండా చూడాలని ఎస్ఈసీకి విజ్ఞప్తి చేశాం" అని జగన్ తెలిపారు.

## ప్రశ్నించే నోళ్లను మూయించేందుకే పోలీసు దౌర్జన్యం: రాహుల్‌గాంధీ

మొదటిపేజీ తరువాయి

ఢిల్లీ: ఇకపై ఎవరూ ప్రశ్నించే ధైర్యం చేయకుండా ప్రజల నోళ్లను మూయించే కుట్రలో భాగంగానే విద్యార్థులు, మహిళలపై ఢిల్లీ పోలీసులు ఇటీవలి ప్రదర్శనల్లో తీవ్ర అణచివేతకు పాల్పడ్డారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ శనివారం ఆరోపించారు. పోలీసు దౌర్జన్యం సిగ్గుపడాల్సిన రీతిలో అన్ని హద్దులూ దాటిపోయిందని ఆయన తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. "ప్రజాస్వామ్యం కోసం గళం విప్పిన విద్యార్థులు, మహిళలకు వ్యతిరేకంగా ఢిల్లీ పోలీసుల దౌర్జన్యం హద్దు మీరిపోయింది. ఇందులో భాగంగా ఢిల్లీ పోలీసులు లైంగిక వేధింపులకు పాల్పడటం, వస్త్రాలు లాగడం, వంటి సిగ్గుమాలిన పనులు చేశారు" అని ఆయన అన్నారు.

"ఇదంతా ప్రజా గళాన్ని మూయించే కుట్రలో భాగం. ఎవరూ ప్రశ్నించే సాహసం చేయకుండా నిరోధించాలనే కుట్రలో భాగంగా నిరసనకారుల్లో భయాన్ని నింపుతూ వారిని తీవ్రంగా అవమానించడమే ఈ దమననీతి ఆంతర్యం" అని ఆయన అన్నారు. "అధికారం చేజారిన మరుక్షణం తమ ఇష్టారాజ్యం అంతమైపోతుందని మోదీ-షాలకు తెలుసు. ఆ భయంతోనే పోలీసుల సాయంతో దేశంలోని మహిళలపై, యువజనులపై హింస, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు" అని ఆయన అన్నారు. ఇటీవలి నిరసన ప్రదర్శనల్లో పోలీసుల చేతిలో తీవ్ర దౌర్జన్యానికి గురైన కొందరు యువకులతో తాను జరిపిన సంభాషణకు సంబంధించిన పది నిమిషాల వీడియోను కూడా ఆయన తన పోస్టుకు జతచేశారు.

## భారత్ విషయంలో ఆ రోజు హద్దులు దాటి మాట్లాడాను: జేడీ వాన్స్

మొదటిపేజీ తరువాయి

కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, టాటా, విప్రో, హెచ్‌సీఎల్, క్యాప్‌జెమిని కంపెనీలను పర్మ్ (పర్మినెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్) నుంచి సస్పెండ్ చేసిన సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనిపై తాజాగా ఓ సమావేశంలో మాట్లాడుతూ.. పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. 'భారత్ విషయంలో ఆ రోజు నేను హద్దులు దాటి మాట్లాడాను. 'విదేశీ ఒప్పంద పనివాళ్లు' అని నేను వాడిన పదం సరైనది కాదు. ప్రసంగంలో ఏమైనా లోపాలు ఉంటే.. అది నా తప్పే. హెచ్-1బీ వీసాదారులను లక్ష్యంగా చేసుకోవాలనేది నా ఉద్దేశం కాదు. అమెరికా కంపెనీలు, వీసా వ్యవస్థ గురించి మాట్లాడాలనుకున్నాను. ఉద్యోగులు అమెరికాకు హెచ్-1బీ వీసాపై వస్తారు. వారిని తీసుకున్న కంపెనీలు ఆ పనికి ప్రత్యామ్నాయ అమెరికన్ కార్మికుడు దొరకలేదని పేర్కొంటాయి. దీంతో స్థానికులకు అవకాశాలు దక్కవు. దేశంలో తరచుగా ఇదే జరుగుతోంది. అందుకే ఆ విధంగా మాట్లాడాల్సి వచ్చింది' అని వాన్స్ పేర్కొన్నారు.

భారత్ ఒక్క రాత్రిలో రష్యా చమురుకు దూరం కాలేదు: రూబియో

నాడు వాన్స్ ఏమన్నారంటే..?

హెచ్-1బీ వీసాలపై నియమించుకునే విదేశీ ఉద్యోగులను 'విదేశీ ఒప్పంద పనివాళ్లు'గా, ఆ ప్రోగ్రామ్‌ను ఉపయోగించుకునే కంపెనీలను 'వీసా మిల్లులు'గా వాన్స్ అభివర్ణించారు. ఆయన వ్యాఖ్యలపై కేంద్ర విదేశాంగ శాఖ తీవ్ర అభ్యంతరం తెలిపింది. నిపుణుల తరలింపు.. భారతీయులకు అవకాశాలు కల్పించడంతో పాటు అమెరికా కంపెనీల సంపదను కూడా పెంచుతోందని పేర్కొంది. ఆవిష్కరణలు, పరిశోధన, ఉత్పాదకత, పోటీతత్వం, ఉద్యోగకల్పన వంటి విషయాల్లో కంపెనీలకు అత్యాధునిక ప్రతిభ ఎంతో సహాయకారిగా ఉందని వ్యాఖ్యానించింది. ఈ విషయంపై వాన్స్ అనవసరంగా మాట్లాడారని అభిప్రాయపడింది.

## శాంతికి హామీ... దీప్కేకు బెయిల్

మొదటిపేజీ తరువాయి



ఢిల్లీ: పోలీసుల అదుపులో ఉన్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే శనివారం విడుదలయ్యారు. శుక్రవారం ఆందోళనల సందర్భంగా పోలీసులు అరెస్టు చేయగా శనివారం బెయిలు లభించింది. దీంతో ఆయన సాయంత్రం సమయంలో పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వచ్చారు. అయితే కోర్టు ఆయనకు షరతులు విధించింది. శాంతికి హామీ ఇస్తూ బాండ్ సమర్పించాలని, రూ.50,000 పూచీకత్తు ఇవ్వాలని ఆదేశించింది. బాండ్‌పై సంతకం చేసి, పూచీకత్తు సమర్పించాక ఆయన మందిర్‌మార్గ్ పోలీస్ స్టేషన్ నుంచి విడుదలయ్యారు. అంతకుముందే శనివారం ఉదయం ఏఐఎస్ఏ అధ్యక్షురాలు నేహా బోరాను పోలీసులు విడుదల చేశారు.

### వైఫై లేదు.. ఫోన్ లేదు

స్టేషన్ నుంచి బయటకు రాగానే.. 2004లో వచ్చిన వీర్-జారా సినిమాలో హీరో షారుక్ ఖాన్ కన్నీళ్లు పెట్టుకుంటున్న చిత్రాన్ని సామాజిక మాధ్యమాల్లో దీప్కే పోస్టు చేశారు. 22 ఏళ్లు పాకిస్థాన్ జైల్లో ఉండి విడుదలై వచ్చినప్పుడు షారుక్ ఖాన్ అలా కన్నీళ్లు పెట్టుకుంటారు. '24 గంటలపాటు వైఫై, ఫోన్ లేకుండా జైల్లో ఉండి బయటకు వస్తే ఎలా ఉంటుంది' అని దీప్కే దానికి క్యాప్షన్ పెట్టారు.

### రాత్రంతా జైల్లోనే..

శుక్రవారం అదుపులోకి తీసుకున్న దీప్కే, బోరాలను రాత్రంతా పోలీస్ స్టేషన్‌లోనే ఉంచారు. బోరాను శనివారం ఉదయం విడుదల చేశారు. శుక్రవారం నాటి తిరంగా ఆందోళనలపై ఢిల్లీ పోలీసులు శనివారం పలు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారు.

# వార్తలు ఉచితంగా కావాలి.. ప్రకటనల దగ్గర ముఖం చాటేస్తారా?

- జర్నలిస్టుల వార్తలతో రాజకీయ ప్రచారం..ప్రకటనల విషయంలో మాత్రం నిర్లక్ష్యమా?




**ఆందోల్, అక్టోబర్ 19 (సందేశం టైమ్స్ ప్రతినిధి ):**
సంగారెడ్డి జిల్లా పరిధిలో ఏడాది పొడవునా రాజకీయ నాయకుల కార్యక్రమాలు, సమావేశాలు, పర్యటనలు, ఇతర కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జర్నలిస్టులు నిరంతరం వార్తలు రాస్తూ తమ వృత్తి బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. అయితే వార్తల ప్రచురణ కోసం జర్నలిస్టులు గుర్తుకొచ్చే కొందరు రాజకీయ నాయకులు, దసరా, నూతన సంవత్సర క్యాలెండర్ ప్రకటనల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ నాయకుల కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ప్రచురించాల్సినప్పుడు జర్నలిస్టులతో సంప్రదింపులు జరిపే నాయకులు, పత్రికల నిర్వహణకు సహకరించే ప్రకటనల విషయం వచ్చేసరికి స్పందించకపోవడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏ పార్టీలో ఉన్నా, ఏ పదవిలో కొనసాగుతున్నా ప్రజాప్రతినిధులు జర్నలిస్టుల పాత్రను గుర్తించాలని, ప్రజలకు సమాచారాన్ని చేరవేయడంలో మీడియా అందిస్తున్న సేవలను గౌరవించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. పత్రికల నిర్వహణకు ప్రకటనలు ఆర్థికంగా తోడ్పడటంతో పాటు స్థానిక వార్తా సేకరణ, ప్రచురణకు సహకరిస్తాయి. రాజకీయ నాయకులు తమ కార్యక్రమాలకు వార్తా ప్రాధాన్యం కోరుకోవడం సహజమేనని, అదే సమయంలో పత్రికల నిర్వహణకు తమవంతు సహకారం అందించడం కూడా అవసరమని జర్నలిస్టులు పేర్కొంటున్నారు. జర్నలిస్టుల శ్రమను గుర్తించి, పత్రికల అభివృద్ధికి సహకరించే విషయంలో రాజకీయ నాయకులు సానుకూలంగా స్పందించాలని వారు కోరుతున్నారు.

# నాగులవంచలో ఘనంగా మహా అన్నదాన కార్యక్రమం

అన్నదానాన్ని ప్రారంభించిన సర్పంచ్ నారగాని రాంబాయి, ఏఎంసీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు

**చింతకాని, అక్టోబర్ 18 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**





ఖమ్మం జిల్లా చింతకాని మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలోని కనకదుర్గా నగర్ నక్కలబండ వద్ద మహా అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నాగులవంచ సర్పంచ్ నారగాని రాంబాయి, మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, అన్నదాతలు వంకాయలపాటి సత్యనారాయణ, వంకాయలపాటి రేణుక సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. అన్నదానం మహాదానమనే స్ఫూర్తితో నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తి, సేవాభావానికి ప్రతీకగా నిలిచింది. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన దాతలు వంకాయలపాటి సత్యనారాయణ, వంకాయలపాటి రేణుకలను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భవానీ భక్తులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

# పోసానిపేటలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు


Pic 1: Bathukammalu


Pic 2: Pedda Bathukamma



**అందోల్ అక్టోబర్ 19 (సందేశం టైమ్స్)**
అందోల్ మండలం పోసానిపేట గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు సంప్రదాయబద్ధంగా, ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, ఒకచోట చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రకృతిని పూజించే గొప్ప సంప్రదాయాన్ని చాటిచెబుతుంది. పూలతో బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ చేరి పాటలు పాడుతూ వేడుకలు జరుపుకోవడం తెలంగాణ ఆడపడుచుల ప్రత్యేకత. గ్రామ మహిళలంతా కలిసికట్టుగా పండుగలో పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని భావితరాలకు అందించేలా బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఆదరించి, ఈ సంప్రదాయాన్ని కొనసాగించాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

# రాంసాన్‌పల్లిలో దుర్గాదేవిగా దర్శనమిచ్చిన దుర్గాభవాని అమ్మవారు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఎనిమిదో రోజు ప్రత్యేక పూజలు



**ఆందోల్, అక్టోబర్ 19 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం రాంసాన్‌పల్లి గ్రామంలో భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు దుర్గాభవాని అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించగా గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అమ్మవారి కృపాకటాక్షాలతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు. అమ్మవారి దివ్యదర్శనం చేసుకుంటూ 'ఓం శ్రీ మాత్రే నమః' మంత్రాన్ని జపించి అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పండుగ హనుమంతు, ఉపసర్పంచ్ పృథ్వీరాజ్, పట్లోళ్ల మాజీ సర్పంచ్ సువర్ణ దామోదర్ రెడ్డి, శివారెడ్డి, కోరుబోయిని మాజీ సర్పంచ్ లక్ష్మి ఆగమయ్య, జోగిరెడ్డి, జోగేందర్, సారవర్మ, బోయిని గోపాల్, అంజా గౌడ్, శ్రీనివాస్ గౌడ్, పాల్వంచ రవి, మల్లేశ్ గౌడ్, శంకర్, మొగులయ్య, లక్ష్మణ్, శివకుమార్, శ్రీనివాస్, గోపాల్, శంకు, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేరుర్ వినయ్ గౌడ్, రాంసాన్‌పల్లి గ్రామ ఉపసర్పంచ్ పృథ్వీరాజ్ ఏడుపాయల దుర్గాభవాని అమ్మవారిని దర్శించుకున్నారు.

# రాంసాన్‌పల్లిలో ఘనంగా బతుకమ్మ వేడుకలు.. మహిళలకు వాటర్ బాటిళ్ల పంపిణీ

**అందోల్, అక్టోబర్ 19 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**



సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం రాంసాన్‌పల్లి గ్రామంలో బతుకమ్మ వేడుకలను గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పండుగ హనుమంతు, ఉప సర్పంచ్ పృథ్వీరాజ్ పేర్ల మీదుగా బతుకమ్మ ఆడే మహిళలకు వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. బతుకమ్మ వేడుకల్లో పాల్గొనే మహిళలకు తాగునీటి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ పంపిణీ చేపట్టారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామస్తులు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు రాయిని శివచందర్, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఫుడ్ పాయిజన్ బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

41 మంది బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచన



**మెదక్, అక్టోబర్ 19 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
మెదక్ రోడ్డులోని వన్ ప్లస్ మండి రెస్టారెంట్‌లో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనలో అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 41 మంది బాధితుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఫుడ్ పాయిజన్ ఘటనలో ఒకరు మృతి చెందడం పట్ల ఎమ్మెల్యే తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, బాధితులందరూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు

# బ్రాహ్మణగూడలో డీజే, డప్పు చప్పుళ్లతో మార్మోగిన బతుకమ్మ సంబరాలు



**హత్నూర మండలం, అక్టోబర్ 19 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బ్రాహ్మణగూడ గ్రామంలో సద్దుల బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. గ్రామంలోని మహిళలు, అక్కాచెల్లెళ్లు, చిన్నారులు రంగురంగుల పట్టుచీరలు ధరించి ముస్తాబై, రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ తిరుగుతూ సంప్రదాయ పాటలు పాడి ఆటపాటలతో సందడి చేశారు. డప్పు చప్పుళ్లు, డీజే పాటలతో పండుగ వాతావరణం మరింత ఉత్సాహభరితంగా మారింది. యువతీ యువకులు డీజే పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలు, మహిళల భక్తిశ్రద్ధలు, పండుగ సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామ పెద్దలు, యువకులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను తిలకించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామస్తులు ఐకమత్యంతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

# పోతిరెడ్డిపల్లిలో వైభవంగా శ్రీ దుర్గాభవాని శరన్నవరాత్రి ఉత్సవాలు..

అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**అక్టోబర్ 19(సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్)**
సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లిలో కౌన్సిలర్ పొన్న రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా నిర్వహించిన శ్రీ దుర్గాభవాని శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాన్ని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సందర్శించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, కౌన్సిలర్ పొన్న దశరథ్ రెడ్డి, విఠల్, చిక్కుల మల్లేశం, నగేష్ తదితరులు పాల్గొన్నారు

## దసరా సందర్భంగా గ్రామ పెద్దలకు చీరల పంపిణీ.. మాజీ సర్పంచ్ కుమార్తె దీవెనకు అభినందనలు



**ఆందోల్, అక్టోబర్ 19 (సందేశం టైమ్స్ ప్రతినిధి):** సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం అల్మాయిపేట్ గ్రామంలో దసరా పండుగను పురస్కరించుకుని మాజీ సర్పంచ్ రవిశంకర్ కుమార్తె దీవెన గ్రామంలోని పెద్దమనుషులకు చీరలను పంపిణీ చేశారు. తన తండ్రి రవిశంకర్ సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ పండుగ సందర్భంగా గ్రామ పెద్దలకు చిరుకానుకగా చీరలను అందజేశారు. దీవెన అందించిన చీరలను గ్రామ పెద్దలు సంతోషంగా స్వీకరించి ఆమెను అభినందించారు. భవిష్యత్తులో దీవెన మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని, ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని గ్రామ పెద్దలు ఆకాంక్షించారు.

## యాసంగిలో వరి సాగు తగ్గించి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి

**మెదక్, అక్టోబర్ 19 (సందేశం టైమ్స్ ప్రతినిధి):** ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి ఎద్దడి ఏర్పడే పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, 2026--27 యాసంగి సీజన్‌లో వరి సాగును తగ్గించి, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. రైతులకు పంటల మార్పిడిపై అవగాహన కల్పించడంతో పాటు ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలు, పెట్టుబడి, మార్కెటింగ్ సదుపాయాలను ముందుగానే అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆదివారం కలెక్టరేట్ నుంచి విడుదల చేసిన ప్రకటనలో యాసంగి పంటల సాగు ప్రణాళికపై పలు సూచనలు చేశారు. జిల్లాలో వర్షపాతం లోటు, జలాశయాల్లో నీటి నిల్వలు, భూగర్భ



జలాల లభ్యతను పరిగణనలోకి తీసుకొని పంటల సాగు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. నీటి వనరులు పరిమితంగా ఉన్న గ్రామాల్లో వరి సాగును తగ్గించి పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, ఇతర ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. గత యాసంగి సీజన్‌లో సాగు చేసిన పంటల విస్తీర్ణాన్ని ప్రాతిపదికగా తీసుకొని మండలాలు, క్లస్టర్ల వారీగా పంటల మార్పిడి లక్ష్యాలను నిర్ణయించాలని అధికారులను ఆదేశించారు. భూగర్భ జలాల సమస్య ఉన్న గ్రామాల్లో బోరుబావులపై ఆధారపడి వరి సాగు చేయకుండా రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. తాగునీటికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని, భూగర్భ జలాల పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించడంతో పాటు ఆయా పంటలకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, పెట్టుబడి సహాయం, మార్కెటింగ్ సదుపాయాలు అందుబాటులో ఉండేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు సూచించారు

## భవాని కాలనీలో 7వ రోజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కర్..



**అక్టోబర్ 19(సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్)** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని మంగళ్‌పేట్ భవాని కాలనీలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 7వ రోజు అమ్మవారిని మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కర్ దర్శించుకున్నారు. కాలనీ వాసుల ఆహ్వానం మేరకు అమ్మవారి ఆలయానికి విచ్చేసిన నగేష్ కుమార్ షెట్కర్ గారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా భవాని కాలనీ వాసులు మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కర్ గారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెంకట్ నాయక్, నారాయణ నాయక్, గణపతి , రాములు మేఘ నాయక్, నారాయణఖేడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జ్ఞానేశ్వర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు మాణిక్ రావు పటేల్, నందు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దరెడ్డిపేటలో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు

**పుల్కల్, అక్టోబర్ 119 (సందేశం టైమ్స్ అందోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కే. మల్లేశం గౌడ్):** సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం పెద్దరెడ్డిపేట గ్రామంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు, యువతులు ఉత్సాహంగా చేరి సంప్రదాయ ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మ పాటలు ఆలపిస్తూ, లయబద్ధంగా చప్పట్లు కొడుతూ నృత్యాలు చేయడంతో పల్లెవీధులు మార్మోగాయి. ఈ వేడుకలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు బతుకమ్మ పండుగ నిదర్శనంగా నిలిచింది. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. పెద్దరెడ్డిపేటతో పాటు పలు గ్రామాల్లో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు పల్లె



సంస్కృతికి ప్రతిబింబంగా నిలిచి ప్రజల్లో ఆనందోత్సాహాలను నింపాయి.

## పోసానిపేటలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు - ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఉప సర్పంచ్ జి. రాములు

**అందోల్-పోసానిపేట అక్టోబర్ 19 సందేశం టైమ్స్ ఉమ్మడి మెదక్ జిల్లా** అందోల్ మండలం పోసానిపేట గ్రామంలో సద్దుల బతుకమ్మ పండుగను మహిళలు అత్యంత సంతోషంగా, సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. గ్రామంలోని ఆడబిడ్డలంతా రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ ఆడి పాడారు. ఈ సందర్భంగా గ్రామ ఉప సర్పంచ్ జి. రాములు మాట్లాడుతూ, "ఈరోజు మన పోసానిపేట




గ్రామంలో బతుకమ్మ పండుగ ఎంతో సంతోషకరంగా జరిగింది. గ్రామ ప్రజలందరికీ, ముఖ్యంగా ఆడబిడ్డలకు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. హిందూ సంప్రదాయాన్ని కాపాడుతూ ఇలాంటి పండుగలు జరుపుకోవడం మనందరి బాధ్యత" అని అన్నారు. ఈ వేడుకల్లో గ్రామ పెద్దలు, మహిళలు, యువతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గ్రామమంతా బతుకమ్మ పూల పరిమళాలతో, ఆటపాటలతో కళకళలాడింది.

## బహిరన్ దిబ్బ గ్రామంలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

**మెదక్ / అల్లాదుర్గం, అక్టోబర్ 19 (సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ఇన్‌చార్జి):**





మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని బహిరన్ దిబ్బ గ్రామంలో సద్దుల బతుకమ్మ పండుగ సంబరాలు ఘనంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామ మహిళలు, యువతులు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూల పండుగగా ప్రసిద్ధి చెందిన బతుకమ్మ వేడుకల్లో మహిళలు ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలను గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా నిర్వహించడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

## వైభవంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

**రాయికోడ్ సందేశం టైమ్స్ అక్టోబర్ 19 సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగ సంబరాలు ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో అంగరంగ వైభవంగా జరిగాయి. రాయికోడ్, హస్నాబాద్, కుష్నూర్, ఇటికేపల్లి, సింగీతం తదితర గ్రామాల్లో మహిళలు సద్దుల బతుకమ్మ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రకృతిలో సహజంగా లభించే తంగేడు, గునుగు, చామంతి, బంతి తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి గౌరమ్మను పూజించారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు మహిళలంతా ఒకచోట చేరి వలయాకారంలో బతుకమ్మల చుట్టూ తిరుగుతూ సంప్రదాయ ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా మహిళలు ఉత్సాహంగా పాల్గొనడంతో





## దెగ్లవాడి గ్రామంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**దెగ్లవాడి (అక్టోబర్ 19) సందేశం టైమ్స్:** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం లోని దేగుల్వాడి గ్రామంలోని బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను దెగ్లవాడి గ్రామంలో మహిళలు, గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, పాటలు పాడుతూ ఆనందోత్సాహాల మధ్య వేడుకల్లో పాల్గొన్నారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.



సందేశం టైమ్స్

19-10-2026

# పురాతన దేవాలయాల పూర్వ వైభవానికి కృషి చేస్తా

**– దేవాలయాల ఉనికిని కాపాడుతున్న భక్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు: ఎమ్మెల్యే జారె**

సందేశం టైమ్స్:
అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం గుర్వాయిగూడెం పెద్దగొల్లగూడెం చిన్నగొల్లగూడెం గ్రామాల సమీపంలో దుర్గంగట్టు మీద కాకతీయుల కాలం నాటి పురాతన దేవాలయాల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు రెండవ ప్రతాపరుద్రుడి కాలంలో కాకతీయ సామ్రాజ్యంతో అనుబంధం కలిగిన చారిత్రక నేపథ్యం ఉన్న శంకరగిరి దుర్గా మల్లేశ్వర స్వామి దేవాలయం వనదేవత కనకదుర్గమ్మ అమ్మవారి దేవాలయాలు ఎంతో ప్రాచీనమైనవని పేర్కొన్నారు కాలక్రమేణా ఆదరణ తగ్గినప్పటికీ పరిసర గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో ఈ దేవాలయాల ఉనికిని కాపాడుతూ వస్తుండటం అభినందనీయమన్నారు పురాతన దేవాలయాలు మన చరిత్రకు సంస్కృతికి ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీకలని వాటిని కాపాడుకోవడం మనందరి బాధ్యతని పేర్కొన్నారు ఇన్నేళ్లుగా దేవాలయాలను పరిరక్షిస్తున్న భక్తులకు స్థానిక గ్రామాల ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ప్రజల ఆకాంక్ష మేరకు ఎమ్మెల్యేగా తన బాధ్యతను నిర్వర్తిస్తూ ఈ పురాతన దేవాలయాలకు పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు ప్రభుత్వ సహకారంతో దేవాలయాల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా కృషి చేసి ఈ చారిత్రక ఆలయాలను భవిష్యత్ తరాలకు అందించేందుకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు ఈ నేపథ్యంలో స్థానిక ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు పెద్దలు భక్తులతో కలసి ఈ దేవాలయాలను సందర్శించారు పూజ కార్యక్రమాలు చేపట్టి దేవాలయాల అభివృద్ధి కోసం దైవ సంకల్పం అందించాలని



ప్రార్థించారు అనంతరం దేవాలయాల పరిసరాలను శుభ్రంచేశారు ఈ కార్యక్రమంలో గుర్వాయిగూడెం సర్పంచ్ ఈశ్వరప్రగడ నాగభూషణం , పెద్దగొల్లగూడెం సర్పంచ్ యాట్ల రాందాసు , రావుల సహదేవుడు , గుర్రం మల్లయ్య , రావుల అప్పారావు , యాట్ల మంగరావు , పాశం ప్రసాద్ , మచ్చల వెంకటేష్ , నారం మురళీ , యాట్ల శివ , కౌలూరి రాము , పూచి గోపి , ముత్తిన రామకృష్ణ , జక్కా వెంకటేష్ , మచ్చల నాగరాజు ,ఉయ్యాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# తుజాల్‌పూర్‌లో ఆడపడుచుల ఆనంద కోలాహలం..

**–ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు**

సందేశం టైమ్స్:
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ముగింపు వేడుకలు బీబీపేట్ మండలం తుజాల్‌పూర్ గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్న పూల పండుగ చివరి రోజైన సద్దుల బతుకమ్మ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు.రంగురంగుల పూలతో బతుకమ్మల అలంకరణ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో భాగంగా మహిళలు తెల్లవారుజాము నుంచే తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర



రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. కొత్త బట్టలు ధరించి, సంప్రదాయబద్ధంగా అలంకరించిన బతుకమ్మలను ఒకచోట చేర్చి, వాటి చుట్టూ తిరుగుతూ పాటలు పాడారు. ఆటపాటలతో గ్రామమంతా సందడిగా మారింది. సంప్రదాయబద్ధంగా సద్దుల నైవేద్యం సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలు సంప్రదాయం ప్రకారం వివిధ రకాల సద్దులను తయారు చేసి బతుకమ్మకు నైవేద్యంగా సమర్పించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సద్దులను పంచుకోవడం ద్వారా ఆత్మీయత, ఐక్యతను చాటుకున్నారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంప్రదాయాలను కాపాడుతూ, భావితరాలకు వాటి విశిష్టతను తెలియజేసేలా ఈ వేడుకలు నిర్వహించారు.గ్రామ ప్రజల భాగస్వామ్యంతో పండుగ సందడి తుజాల్‌పూర్ గ్రామంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో గ్రామ సర్పంచ్ తలారి ప్రవిత శ్రీనివాస్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్ వార్డు సభ్యులు, మహిళలు, యువకులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మహిళలందరూ ఐకమత్యంతో పండుగను జరుపుకోవడంతో గ్రామంలో పండుగ శోభ నెలకొంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాల మధ్య ఘనంగా ముగించారు.

# సద్దుల బతుకమ్మ వేడుకలలో పాల్గొన్న సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మీ

సందేశం టైమ్స్:
ములకలపల్లి:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం మూకమామిడి గ్రామ పంచాయతీలో సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు అత్యంత ఘనంగా,ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.గ్రామ సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మీ ఆధ్వర్యంలో గ్రామ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, ఆటపాటలతో సందడి చేశారు.రాత్రి వేళ గ్రామంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకలో మహిళలు,చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ కోలాహలంగా జరుపుకున్నారు.అనంతరం సర్పంచ్ ఆధ్వర్యంలో మహిళలకు ప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మీ మాట్లాడుతూ..తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ మహిళల ఆత్మగౌరవానికి నిదర్శనమన్నారు.ఆడపడుచులందరూ కలిసికట్టుగా ఇలాంటి పండుగలు జరుపుకోవడం వల్ల గ్రామంలో ఐక్యత,సోదరభావం పెరుగుతుందన్నారు.గ్రామ అభివృద్ధితో పాటు మన సంస్కృతిని కాపాడుకోవడం కూడా మన బాధ్యత అని,ప్రతి ఏటా ఇలాగే బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.వేడుకలకు వచ్చిన మహిళలందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అవార్డు సభ్యురాలు తానం భవాని, వార్డు సభ్యులు కీసరి రాజ్ కుమార్,గ్రామ హెల్త్ వర్కర్ కీసరి వరలక్ష్మి,గ్రామ పెద్దలు గడ్డం వెంకప్ప



కీసరి తిరుపతిరావు తానం వీరస్వామి బాబురావు కృష్ణమూర్తి లక్ష్మణరావు మరియు మహిళలు,వెంకటమ్మ తిరుపతమ్మ నాగమణి సుశీల సరోజినీ భద్రమ్మ లక్ష్మీ అంజలి దుర్గ మరియు తదితర గ్రామ మహిళలు,యువతులు,చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్నా బి.ఆర్.ఎస్. పార్టీ జిల్లా నాయకులు సోయం వీరభద్రం



సందేశం టైమ్స్:
దుర్గమ్మ ప్రత్యేక పూజ కార్యక్రమం లో పాల్గొన్నా సోయం వీరభద్రం ముఖ్య అతిథి గా హాజరు అయిన జిల్లా భా.ర.స నాయకులు సోయం వీరభద్రం ని శాలువ తో సత్కారించిన శివశక్తి యూత్ కమిటీ సభ్యులు అశ్వరావుపేట నియోజకవర్గం దమ్మపేట మండల కేంద్రం శివశక్తి యూత్ ఆద్వర్యంలో మాజీ ఎంపీపీ దారా మల్లికార్జునరావు కాంప్లెక్స్ నందు శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవల సంధర్భంగా వారి ఆహ్వానం మేరకు దుర్గాదేవి అమ్మ వారిని దర్శనం చేసుకొన్న అనంతరం శివశక్తి యూత్ కమిటీ సభ్యులు సోయం వీరభద్రం ని శాలువతో సత్కారించారు.ఈ సంధర్భంగ సోయం వీరభద్రం గారు మట్లాడుతు దుర్గమ్మ తల్లీ దివ్య ఆశీర్వాదలు సమస్త ప్రజానికం పైన ఉండాలని సుఖ సంతోషలతో నిండుగా వర్ధిల్లాలి అని అమ్మ కృపాకాటక్ష్యలు ఎల్లప్పుడూ ఉండాలని వారు ఆకాశిక్షిశీచారు.ఈ కార్యక్రమం లో దమ్మపేట మండలం మాజీ ఎం.పీ.పీ దారా మల్లికార్జునరావు,ఆలయ కమిటీ సభ్యులు తధితరులు పాల్గొన్నారు

# మేడికుందలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు.. సర్పంచ్ చంద్రకళ ఆధ్వర్యంలో వేడుకలు



వట్పల్లి, అక్టోబర్ 19 (సందేశం టైమ్స్ ప్రతినిధి):
సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల పరిధిలోని మేడికుంద గ్రామంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు గ్రామ సర్పంచ్ నలచెరు చంద్రకళ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు, రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ బద్దంగా చప్పట్లు కొడుతూ సంప్రదాయ నృత్యాలు చేయడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రకృతిలో సహజంగా లభించే పూలతో బతుకమ్మలను అలంకరించి గౌరమ్మకు పూజలు నిర్వహించడం ఈ పండుగ ప్రత్యేకతగా నిలిచింది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, మహిళల సాంస్కృతిక వైభవానికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని గ్రామస్తులు పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు, గ్రామ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు.

# మార్వెల్లిలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

వట్పల్లి, అక్టోబర్ 19 (సందేశం టైమ్స్ ప్రతినిధి అందోల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ సిహెచ్ బస్వరాజు ):



సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం మార్వెల్లి గ్రామంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా గ్రామ మహిళలు, యువతులు రంగురంగుల తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి గౌరమ్మను భక్తిశ్రద్ధలతో పూజించారు. అనంతరం బతుకమ్మల చుట్టూ వలయాకారంలో చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ ఆటపాటలతో సందడి చేశారు. గ్రామ సర్పంచ్ చిన్నపట్ల మల్లీశ్వరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో గ్రామ పెద్దలు, యువకులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల జీవన విధానాన్ని, ప్రకృతితో ఉన్న అనుబంధాన్ని ప్రతిబింబిస్తుందని, తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని గ్రామస్తులు పేర్కొన్నారు. మహిళలు, యువతుల ఆటపాటలతో మార్వెల్లి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొని పల్లెవీధులు బతుకమ్మ పాటలతో మార్మోగాయి.

# రంగాపురం - 2 ఎంపిటిసి నుంచి బరిలోకి సిపిఎం అభ్యర్థి.

(సందేశం టైమ్స్ ప్రతినిధి):




త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రెడ్డిగూడెం మండల పరిషత్ రంగాపురం - 2 ప్రాదేశిక నియోజకవర్గం(ఎంపిటిసి) నుంచి సిపిఎం పార్టీ అభ్యర్థిగా ఆ పార్టీ మండల కార్యదర్శి తుమ్మల వీరాస్వామి పోటీ చేస్తున్నారు . రెడ్డిగూడెం అమర్ భవన్ లో ఆదివారం నాడు జరిగిన సిపిఎం పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశంలో మండల కమిటీ ఏకగ్రీవంగా తుమ్మల వీరాస్వామి పేరును ఆమోదించింది . దీంతో రంగాపురం - 2 సెగ్మెంట్ నుంచి సిపిఎం పార్టీ అభ్యర్థి బరిలోకి దిగుతున్నారు.

# సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించిన అశ్వారావుపేట పోలీసులు

సందేశం టైమ్స్:



అశ్వారావుపేట మండల పరిధిలో ప్రజలకు సైబర్ నేరాలపై అశ్వారావుపేట పోలీసులు అవగాహన కల్పించారు, ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ మోసాలు, ఫేక్ లింకులు, యూపీ ఐ మోసాలు, సోషల్ మీడియా మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరితోనూ ఓటీపీ , ఎటిఎం పిన్ , బ్యాంక్ వివరాలు పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని లేదా షషష.సైబరక్రైమ్ .స్త్రశీజ.అఅ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని అశ్వారావుపేట అదనపు నా× దేవ్ సింగ్ సూచించారు.

# రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులపై మాట్లాడిన మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి

సందేశం టైమ్స్:
రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులపై సూర్యాపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి, ఆయనతో పాటు పాల్గొన్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు తదితరులు. మాజీమంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతకావట్లే ఏంచేయాలో దిక్కుతోచక ఈ ప్రభుత్వం చేతులెత్తేస్తుంది. ముఖ్యమంత్రి, మంత్రులు కేవలం స్కాములు, వాటాల కొరకే పనిచేస్తున్నరు. ఈ రాష్టంలో కరువు పరిస్థితి స్పష్టంగా కనపడుతుందితెలంగాణ నుంచి పారుతున్న నీళ్లతోనే ఆంధ్ర లబ్ధిపొందుతుంది. ఇప్పటివరకు కృష్ణలో మనం 18 ఎవీజ ల నీళ్లు కూడా వాడలేదు. కన్నెపల్లి పంపు హౌస్ ఆన్ చేస్తే ప్రతీ చెరువు మత్తడి దునికేది.. తెలంగాణ ప్రాజెక్ట్ లు అన్నీ నిండుకుండలా ఉండేవి గోదావరి నుండి 250 ఎవీజ లు ఎత్తుకునే వాళ్లం కెసిఆర్ హయాంలో తెలంగాణ కు కరువు అనేదే లేకుండే కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండేది కేవలం ఈ ప్రభుత్వం నిరక్ష్యం వల్లనే కరువు పరిస్థితి దాపురించింది. సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టుకు తట్టెడు మట్టి, మాలు అవసరం లేకుండానే ప్రారంభించవచ్చు ఎల్నినో వస్తదని ఏడాది ముందునుంచే నిపుణులు చెబుతున్నారు. ముందే తెలిసి కూడా ఈ ప్రభుత్వం ఏంపట్టనట్టు నిద్రావస్థలో ఉన్నది. కెసిఆర్ హయాంలో రెప్పపాటు కరెంట్ పోనీ రాష్ట్రంగా రికార్డు సృష్టించింది కానీ ప్రస్తుతం రాష్ట్రంలో కరెంట్, నీళ్ల సమస్య ఎవరిని అడిగినా చెప్తారుయాదాద్రి ఫవర్ ప్లాంట్ విషయంలో వాళ్లు మాట్లాడేవన్నీ పచ్చి అబద్దాలు అధికారుల నిర్లక్ష్యం ఉంటే తెలిసిన వెంటనే మెమోలు ఇవ్వొచ్చుకదా ఈ ప్రభుత్వం ఉద్యోగస్తులను బలిచేసే కుట్రలు చేస్తున్నది. ప్రయివేట్ బొగ్గు కమిషన్లకు ఆశపడి సింగరేణిని బదనాం చేస్తున్నారు. పదేపదే చెబుతున్నాం ఈ కరువుకు




ఎల్నినో కారణం కాదు.. ఈ ప్రభుత్వ నిర్లక్ష్యమే మీకు చేతకాకపోతే మాకు అప్పగించండి. విద్యుత్, నీళ్లు ఎట్లా ఇవ్వొచ్చో చూపిస్తాం. మన రాష్ట్ర వనరులను దోచి పరాయి రాష్ట్రాన్ని బాగు చేసేందుకే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంది. ఈ విషయాన్ని ఉద్యోగస్తులు, అన్ని రంగాల ప్రజలుగమనిస్తున్నారు. మళ్లీ కెసిఆర్ రాంగనే అన్నింటిని ఎలా పునరావృతం చేసుకోవాలో మాకు తెలుసున్నారు.

# అమ్మల కన్న అమ్మ పెద్దమ్మ దీవెనలతోనే లోకమంతా సస్యశ్యామలం డిసిఎంఎస్ మాజీ చైర్మన్ - కొత్వాల

పాల్వంచలో పలు అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్న - కొత్వాల

సందేశం టైమ్స్:



అమ్మల కన్న అమ్మ పెద్దమ్మ దీవెనలతోనే లోకమంతా సస్యశ్యామలంగా ఉంటుందని డిసిఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శ్రీదేవి నవరాత్రి మహోత్సవాలలో భాగంగా ఆదివారం పాల్వంచ పట్టణ పరిధిలోని గట్టాయిగూడెం, బొల్లోరిగూడెం లోని ఉత్సవ మండపాల్లో కొత్వాల తో పాటు పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు పూజలు చేశారు. అనంతరం జరిగిన అన్నదానం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ నిత్యం అమ్మ వారిని పూజిస్తే సకల సౌఖ్యాలు కలుగుతాయన్నారు.

ఈ కార్యక్రమంలో లికార్పొరేటర్లు కొత్వాల విమలాదేవి, పైడిపల్లి జయలక్ష్మి, మల్లెల స్వప్న, సీరపు సుగుణ, నూకల సరిత, దంతెబోయిన నరేష్, బీ ఆర్ ఎస్ నాయకులు మల్లెల రవిచంద్ర, కాంగ్రెస్ నాయకులు మహీపతి రాంలింగం, కొండం వెంకన్నగౌడ్, పైడిపల్లి మహేష్, వై. వెంకటేశ్వర్లు, గుర్రం వెంకటరత్నం, కత్తి శ్రీను, వీరకుమార్, కత్తి వెంకట్, సముద్రాల శ్రీను, సముద్రాల రాంబాబు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పండుగలు వస్తే చాలు ఇష్టం ఉన్నట్లు ఆర్టీసీ ఛార్జీలు పెంచి ప్రజలను బాదుడేనా ప్రయాణికుల ఆవేదన

సందేశం టైమ్స్:
బతుకమ్మ, దసరా పండుగ వేళ ప్రజలకు కానుకలు ఇవ్వాల్సింది పోయి టికెట్ ధరలను డబుల్ చేసి నిలువుదోపిడీ చేయడం సిగ్గుచేటు అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్ బస్సులు తగ్గించి, స్పెషల్ బస్సుల పేరుతో ప్రయాణికుల జేబులకు చిల్లులు పెట్టడం దుర్మార్గం అని ప్రజలు వాపోయారు. జెబిఎస్ నుంచి కరీంనగర్‌కు రూ. 230 ఉండే టికెట్‌ను ఏకంగా రూ. 400కు పెంచారు. మహబూబ్‌నగర్ నుంచి ఎంజీబీఎస్‌కు మొన్నటివరకు రూ. 220 ఉండగా ఇప్పుడు రూ. 290 పైగా వసూలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రూట్లలో టికెట్ ఛార్జీలు డబుల్ చేసి, జేబులు గుల్ల చేసి, ప్రజలకు పండుగ సంబురం లేకుండా చేస్తున్నారు. ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచకుండా,



రెగ్యులర్ గా నడిచే బస్సులకే పండుగ స్పెషల్ బోర్డులు తగిలించి చేస్తున్న ఈ దోపిడీ ముమ్మాటికీ ప్రజాపీడనే అవుతుంది. మహిళలకు ఉచిత ప్రయాణం అని చెప్పి పురుషుల నుంచి డబుల్ ఛార్జీలు వసూలు చేస్తారా అని ప్రజలు అంటున్నారు. భార్యకు ఫ్రీ టికెట్ భర్తకు డబుల్ టికెట్ వసూలు చేస్తే, మహిళలకు రాయితీ ఇచ్చినట్టా లేక ఆ భారాన్ని తిరిగి అదే కుటుంబంపై మోపినట్టా ఒక చేత్తో ఉచిత ప్రయాణం మరో చేత్తో డబుల్ దోపిడీ అని ప్రజలు వాపోతున్నారు. ఇదేనా మీ ప్రజాపాలన ఇప్పటికే మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో ఆర్టీసీ టికెట్ ఛార్జీలను 5 సార్లు పెంచారు. ఇప్పుడు పండుగల పేరుతో డబుల్ ఛార్జీలు వసూలు చేస్తూ ప్రజల నడ్డి విరుస్తున్నారు అని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ తీరుతో పండుగలకు సొంతూళ్లకు వెళ్లాలంటేనే పేద, మధ్యతరగతి ప్రజలు భయపడే దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం వెంటనే స్పందించి, పండుగల పేరుతో పెంచిన అడ్డగోలు ఛార్జీలను తగ్గించాలి. రెగ్యులర్ బస్సులను యథావిధిగా నడిపి, పేద, మధ్యతరగతి ప్రజలపై అదనపు భారం పడకుండా చూడాలని పలు ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నారు .

# శ్రీ గాయత్రీ దుర్గాదేవి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించిన మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్



సందేశం టైమ్స్:
శ్రీ దుర్గా దేవి అమ్మవారి నవరాత్రి ఉత్సవాల భాగంగా జగిత్యాల జిల్లా జగిత్యాల పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ దేవాలయంలో ఆదివారం నిర్వహిస్తున్న శ్రీ గాయత్రీ దుర్గాదేవి అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ గాయత్రీ దుర్గాదేవి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

అమ్మవారి ఆశీస్సులతో జగిత్యాల పట్టణ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజలందరికీ అమ్మవారి కృపాకటాక్షాలు లభించాలని ప్రార్థించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటున్నారు

# జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఎస్ఐ శ్రీకాంత్పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- కేవలం సస్పెన్షన్తో సరిపెట్టొద్దు..
చట్టపరమైన చర్యలు తీసుకోవాలి:
టీఎంజేఎఫ్.

తెలంగాణ.రాష్ట్ర సలహాదారుడు.
కమ్మకోల్ యాదయ్య డిమాండ్.

సందేశం టైమ్స్:
జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐ శ్రీకాంత్ను కేవలం సస్పెండ్ చేయడం సరిపోదని, ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం (టీఎంజేఎఫ్) తెలంగాణ.రాష్ట్ర. సలహాదారుడు కమ్మకోల్ యాదయ్య డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత జర్నలిస్టులకు న్యాయం జరిగేలా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.
6



# అప్రకటిత విద్యుత్ కోతలు ఎత్తివేయాలి : రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి:

- వెల్గటూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్ పర్సన్ గుండాటి గోపిక- జితేందర్ రెడ్డి

సందేశం టైమ్స్:
రాష్ట్ర ప్రభుత్వం ఆవలంబిస్తున్న అప్రకటిత విద్యుత్ కోతల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని, ఆరుగాలం శ్రమించిన పంటలు చేతికందకందే సమయంలో ఎండిపోయే ప్రమాదం ఉందని బిఆర్ఎస్ పార్టీ జిల్లా మహిళా నాయకురాలు, వెల్గటూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్ పర్సన్ గుండాటి గోపిక- జితేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. హై ఓల్టేజ్, లో ఓల్టేజ్ వల్ల పదేపదే కరెంటు ట్రిప్ కావడంతో రైతుల పొలాల్లో విద్యుత్ మోటార్లు కాలి పోతున్నాయని, దీని వల్ల రైతులు ఆర్థికంగా నష్ట పోతున్నారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎల్ ని నో ప్రభావంతో రైతులు ఇప్పటికే తీవ్రంగా నష్టపోయారని, దానికి తోడు విద్యుత్ కోతలు విధించడంతో రైతుల పరిస్థితి ఆగమ్య గోచరంగా మారిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అప్రకటిత విద్యుత్ కోతలు ఎత్తివేసి, రైతులకు నాణ్యమైన విద్యుత్ ను అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు



# నిరుపేదలకు ఉచిత కంటి శస్త్రచికిత్సలు




సందేశం టైమ్స్:
జగిత్యాల పవని కంటి ఆసుపత్రిలో ఆపి, రోటరీ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జగిత్యాల నియోజకవర్గానికి చెందిన 9 మంది నిరుపేదలకు ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు నిర్వహించినా జగిత్యాల ఎమ్మెల్యే డా" సంజయ్ కుమార్ శస్త్రచికిత్సలు చేయించుకున్న నిరుపేదలకు ఉచితంగా కంటి అద్దాలు, మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు టీవీ సూర్యం, డాక్టర్ విజయ్, ఆసుపత్రి సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రవీందర్ కి ఆర్థిక సహాయం అందించిన డా.కవ్వంపల్లి సత్యనారాయణ

సందేశం టైమ్స్:
అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ నాయకుడు రవీందర్ కి ఆర్థిక సహాయం అందించిన డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ. మానవత్వం, సేవాభావం, ఆప్యాయతకు నిలువెత్తు నిదర్శనంగా మానకొండూరు ఎమ్మెల్యే, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నిలిచారు. పర్వతగిరి మండల ఎస్సీ విభాగం అధ్యక్షుడు నరుకుడు రవీందర్ అనారోగ్యంతో బాధపడుతూ హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని వరంగల్ జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ ద్వారా తెలుసుకున్న డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వెంటనే స్పందించారు. ఆసుపత్రికి స్వయంగా విచ్చేసి రవీందర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు, తన వంతుగా ఆర్థిక సహాయం అందించి అండగా



నిలిచారు. రాజకీయాల్లో పదవులు, హోదాలు మాత్రమే గొప్పతనానికి కొలమానం కావని, కష్టకాలంలో తోటి మనిషికి అండగా నిలవడమే నిజమైన నాయకత్వానికి నిదర్శనమని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తన చర్య ద్వారా నిరూపించారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తల కష్టసుఖాల్లో భాగస్వాములవుతూ, వారి కుటుంబాలకు భరోసానివ్వడం ఆయన సేవా దృక్పథానికి అద్దం పడుతోంది. ఆపదలో ఉన్న కార్యకర్తను పరామర్శించి, ఆర్థిక సహాయం అందించడం ద్వారా ఆయన చూపిన ఔదార్యం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా వైస్ చైర్మన్ పోలెపాక సుమన్ క పేర్కొన్నారు. కార్యకర్తల సంక్షేమం పట్ల ఆయన చూపుతున్న చొరవ, ఆప్యాయత, దయాగుణం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్న నరుకుడు రవీందర్‌కు అండగా నిలిచి, మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం అందించిన డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రతి నాయకులు తమకు తోచిన ఆర్థిక సహాయం రవీందర్కి అందించాలని, జిల్లా ఎస్సీ దీపార్ట్మెంట్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ కి కృతజ్ఞతలు తెలుపుచు రవీందర్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలని గొర్రెకుంట మాజీ ఎంపీటీసీ సభ్యులు, జిల్లా ఎస్సీ విభాగం వైస్ చైర్మన్ పోలేపాక సుమన్ పత్రికా ముఖంగా తెలియజేశారు.

# శమీ పూజకు మాజి శాసనసభ్యులు సంకినేని వెంకటేశ్వరరావుకు ఆహ్వానం

సందేశం టైమ్స్:



ఈనెల 20 మంగళవారం రోజున విజయదశమి సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో గల జిల్లా పరిషత్ కార్యాలయంలో సాయంత్రం ఐదు గంటలకు సూర్యాపేట మున్సిపాలిటీ సహకారంతో శ్రీ సంతోషిమాత దేవాలయం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన షమీ పూజ కార్యక్రమానికి పాల్గొనవలసిందిగా కోరుతూ మాజీ శాసనసభ్యులు సంకినేని వెంకటేశ్వరరావు కు శ్రీ సంతోషి మాత దేవాలయ అధ్యక్షులు బ్రాహ్మణపల్లి మురలీధర్ ఉత్సవ నిర్వాహకులు గోపారపు రాజు లు ఆదివారం ఆయన నివాసంలో ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

- దాస్యం వినయ్ భాస్కర్,నన్నపనేని నరేందర్‌తో కలిసి ప్రత్యేక పూజలు

సందేశం టైమ్స్:
ఓరుగల్లు ఇలవేల్పు శ్రీ భద్రకాళి అమ్మవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు,రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆదివారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్,మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. కాకతీయుల కాలం నాటి చారిత్రక పుణ్యక్షేత్రమైన భద్రకాళి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా దుర్గామాత అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన రవిచంద్రకు ఆలయ కమిటీ సభ్యులు,అధికారులు,వేద పండితులు మేళతాళాలు,పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం రవిచంద్రతో పాటు దాస్యం వినయ్ భాస్కర్,నన్నపనేని నరేందర్ తదితరులు తమ గోత్రనామాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజల అనంతరం ప్రధాన అర్చకులు శేషు అయ్యగారు. వేద పండితులు నాగరాజు శర్మ, అరవింద్ శర్మ, వారికి శాలువాలు కప్పి సత్కరించారు. అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వచనాలు పలికారు ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి ఈవో ఀ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రాయల సునీత, సూపర్డెంట్ కుచన హరినాథ్,మున్నూరు కాపు నాయకులు కూసం శ్రీనివాస్, సిబ్బంది నాగులు, సందీప్, ప్రభాకర్, తదితరులతోపాటు విఆర్సి యూత్ సభ్యులు పాల్గొన్నారు భద్రకాళి అమ్మవారికి తొమ్మిది రోజుల పాటు పూలంగి సేవలు:వద్దిరాజు రవిచంద్ర వరంగల్‌లోని చారిత్రక శ్రీ భద్రకాళి దేవస్థానంలో నిర్వహించనున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో అమ్మవారికి పూలంగి సేవలు నిర్వహించే భాగ్యం తమ కుటుంబానికి లభించడం అదృష్టంగా భావిస్తున్నామని రాజ్యసభ సభ్యులు, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. నవరాత్రి ఉత్సవాల్లో



భాగంగా తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం శ్రీ భద్రకాళి అమ్మవారికి,అమ్మవారి శేష వాహనాలకు వివిధ రకాల పుష్పాలు, గజమాలలతో పూలంగి సేవలు నిర్వహించినట్లు వెల్లడించారు. రంగురంగుల పుష్పాలతో అమ్మవారిని, వాహనాలను సర్వాంగసుందరంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ పవిత్రమైన సేవలో భాగస్వాములయ్యే అవకాశాన్ని తమ కుటుంబానికి కల్పించిన శ్రీ భద్రకాళి అమ్మవారికి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణఆడబిడ్డలఆత్మగౌరవ ప్రతీక బతుకమ్మ!బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు

జోగిపేట మున్సిపాలిటీ వైస్ చెర్మన్
ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు)




సందేశం టైమ్స్:
తెలంగాణ సంస్కృతికి వైభవంఆడపడుచుల ఆత్మీయతకు ప్రతిరూపశీ పూలలో ప్రకృతిని పూజించే అపురూప సంప్రదాయం మన బతుకమ్మ మన తెలంగాణ బతుకమ్మ! బతుకమ్మ అంటే కేవలం పూలను పేర్చి ఆడుకునే పండుగ మాత్రమే కాదు అది తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి మహిళల ఐక్యతకు,ప్రకృతి ప్రేమకు మన సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం ప్రతి పువ్వులో ఒక అందం ప్రతి పాటలో ఒక భావం ప్రతి అడుగులో ఒక ఆనందం ప్రతి బతుకమ్మలో తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయత దాగి ఉంటుందితంగేడు పూల పసిడి అందాలు, గునుగు పూల రంగుల హరివిల్లు, బంతిపూల సోయగాలు, చామంతుల పరిమళాలు, గుమ్మడి పూల ప్రత్యేకత, రకరకాల అడవి పూల సహజ సౌందర్యంతో పేర్చిన బతుకమ్మ మన ప్రకృతి సంపదకు ప్రతిబింబం రంగురంగుల పూలను వరుసలుగా పేర్చి, మధ్యలో గౌరమ్మను ప్రతిష్ఠించి, చుట్టూ చేరి చప్పట్లు కొడుతూ పాటలు పాడుతూ చేసే బతుకమ్మ సంబరాలు మన తెలంగాణ జీవన సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు బతుకమ్మ అంటే బతుకు మీద ఆశ బతుకమ్మ అంటే కుటుంబానికి ఆనందం బతుకమ్మ అంటే ఆడబిడ్డల ఆత్మీయ అనుబంధం బతుకమ్మ అంటే ప్రకృతికి కృతజ్ఞతబతుకమ్మ అంటే తెలంగాణ తల్లి ఒడిలో వికసించే పూల పండుగ బతుకమ్మ

# నందిగామ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా వైసిపి తరఫున నామినేషన్ దాఖలు చేసిన చల్లా బ్రహ్మం

సందేశం టైమ్స్:
వైసిపి చైర్మన్ అభ్యర్థి చల్లాబ్రమేశ్వరం నామినేషన్ దాఖలు చేసే ముందు నందిగామ వైసిపి సమన్వయకర్త మాజీ శాసనసభ్యులు మొండితోక జగన్ మోహన్ రావు మొండితోక అరుణ్ కుమార్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ముందుగా ఆంజనేయ స్వామి రామలింగేశ్వర స్వామి శివాలయం కన్యకా పరమేశ్వరి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి నామినేషన్ వేయటానికి ఎన్నికల అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యాలయం వద్దకు వైసిపి నాయకులు కార్యకర్తలతో కలిసి వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు నందగామ పట్టణం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చైర్ పర్సన్ అభ్యర్థిగా చల్లాబ్రమేశ్వరరావు ఎన్నికల అధికారులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాబు జగ్జీవన్ రావ్ హాలు నందు ఎన్నికల అధికారులకు తన నామినేషన్ పత్రాలను అందజేసి ఎన్నికల శంఖారావాన్ని పూరించారు నందిగామ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి చల్లా బ్రహ్మేశ్వర రావు తో పాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియమించిన 16 మంది కౌన్సిలర్లు ఎన్నికల అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు చల్లబ్రహ్మేశ్వరరావు ఆర్యవైశ్య సామాజిక వర్గంలో సేవాతత్పరుడిగా ఎన్నికల వేళ్ళ తప్ప అన్ని సందర్భాలలో రాజకీయాలకు అతీతంగా సమాజ సేవ చేసినటువంటి నాయకుడు చల్లా బ్రహ్మేశ్వర రావు ఆర్యవైశ్య సామాజిక వర్గంలో ఇంతటి గుర్తింపు పొందిన వేక్తిగా పార్టీ పుట్టిన దగ్గర నుండి పార్టీని నమ్ముకుని కష్టపడ్డ వ్యక్తికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి గుర్తించి మరీ చైర్మన్ పదవిని అప్ప చెప్పారని ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ ప్రత్యేకంగా తెలియపరిచారు కూటమి ప్రభుత్వం ఈ రెండున్నర సంవత్సరాల్లో మరి ముఖ్యంగా నందిగామ పట్టణంలోని నందిగామ నియోజకవర్గం అన్నివేళలా అన్నిచోట్ల దోచుకోవటం తప్ప ప్రజా సమస్యలపై ఏనాడూ పనిచేసింది లేదని తెలియపరిచిన ఎమ్మెల్సీ మొశీడితోక అరుణ్ కుమార్ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా మున్సిపల్ ఎన్నికలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియమించిన అందరివాడు ఆర్యవైశ్య







సామాజిక వర్గంలో ఓ మంచి రాజకీయ నేతగా గుర్తింపు పొందినటువంటి వ్యక్తి చల్లా బ్రహ్మేశ్వరరావు తో పాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియమించిన 32 మంది కౌన్సిలర్ ల కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయాన్ని అందిస్తారని నందిగామ పట్టణ ప్రజలందరికీ పేరుపేరునా కోరుతున్నామని మొండితోక అరుణ్ కుమార్ మొండితోక జగన్ మోహనరావు తెలియపరిచారు